క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు


పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం షష్ఠి సందర్భంగా ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మొమిన్ హుస్సేన్ సాహెబ్ సేవలు మరువలేనివి


మొమిన్ హుస్సేన్ సాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మొమిన్ హుస్సేన్ సాహెబ్ సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ నాయకులు, కో ఆప్షన్ సభ్యులు రషీద్, మొమిన్ మునీర్‌బాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వార్డు కౌన్సిలర్లు గౌస్‌లాజం, ఇబ్రహీం, కలిముల్లా, షాకీర్, బైరాపురం మహబూబ్‌బాషా, టైగర్‌బాబు, పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి


మల్యాల వద్ద తెగిపోయిన రహదారిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని మల్యాల వద్దనున్న హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి నీరు తరలించేందుకు ఏర్పాటు చేసిన ముచ్చుమర్రి లింక్ కాలువ మీద బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సీపీఎం మండల నాయకులు ఫక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. ముచ్చుమర్రి లింక్ కాలువ మీద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి నీటి ప్రవాహానికి కొట్టుకు పోవడంతో ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రహదారి తెగిపోవడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, నాగన్న రైతులు ఎల్లనాయుడు, శ్రీరాములుగౌడ్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

95.53 శాతం పింఛన్ల పంపిణీ


మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షఫి

పాములపాడు: మండలంలో పింఛన్ల పంపిణీ 95.53 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ ఆదివారం తెలిపారు. మొత్తం పింఛన్‌దారులు 5,910 మంది ఉండగా మూడు రోజులుగా వలంటీర్లు ఇంటింటికీ తిరిగి 5,646 మందికి నగదు అందజేశారన్నారు. మిగిలిన 264 మందికి కూడా వెంటనే అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

కర్నూలు వెళ్లి పింఛన్ పంపిణీ


మరియమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగమణి

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన శీలం మరియమ్మ అనే మహిళ అనారోగ్య సమస్యల వల్ల కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామవలంటీర్ గుండి నాగమణి ఆదివారం కర్నూలు వెళ్లి లబ్ధిదారురాలికి వితంతు పింఛన్ రూ.2,750 అందించింది. అదేవిధంగా గ్రామానికి చెందిన శీలం రంగమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ నందికొట్కూరు పట్టణంలోని తన మనుమళ్ల వద్ద ఉంటూ చికిత్స తీసుకుంటుంది. వలంటీర్ నాగమణి అక్కడికి కూడా వెళ్లి వృద్ధాప్య పింఛన్ రూ.2,750 లను అందజేసింది. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో కొలువైన సుంకులా పరమేశ్వరీ దేవి

మహానంది: తిమ్మాపురంలోని అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ సుంకులా పరమేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, పరిహారణం, పూర్ణాహుతి పూజలు వైభవంగా జరిగాయి. కాలనీ వాసుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మూగజీవాల ఆరోగ్యానికీ భరోసా

- బర్రెలు, ఆవులు, ఎద్దులు, జీవాలకు ఆరోగ్య సంరక్షణ కార్డులు
- ఎప్పటికప్పుడు వైద్యసేవల వివరాల నమోదు
- బ్యాంకు రుణాలు, బీమా సదుపాయం
- హర్షం వ్యక్తం చేస్తున్న పశుపోషకులు


ఎద్దుకు చికిత్స చేస్తున్న పశువైద్యులు

నందికొట్కూరు నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన ఆరోగ్య సంరక్షణ కార్డుల వివరాలు

మండలం	పశుపోషకుల సంఖ్య	పశువుల సంఖ్య	మంజూరైన హెల్త్ కార్డుల సంఖ్య
జూపాడుబంగ్లా	1,890	44,837	1,890
పగిడ్యాల	2,078	35,149	2,078
నందికొట్కూరు	1,704	59,272	1,704
మిడ్తూరు	1,812	54,335	1,812
కొత్తపల్లి	2,486	38,901	2,486
పాములపాడు	2,094	38,000	2,094
మొత్తం	12,064	2,70,494	12,064

జూపాడుబంగ్లా: మనుషులకే కాదు నోరులేని మూగ జీవాల ఆరోగ్యానికి సైతం భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు మంజూరు చేశారు. జీవాలకు అందజేసిన ఆరోగ్య సేవల వివరాలు ఎప్పటికప్పుడు ఈ కార్డులో నమోదు చేస్తారు. అంతేకాకుండా వైఎస్సార్ పశుబీమా కూడా వర్తించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పశు పోషకులు, జీవాల సంరక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి విడతగా 12,064 కార్డుల మంజూరు

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, మిడుతూరు, పగిడ్యాల, నందికొట్కూరు మండలాల్లో 12,064 పశుపోషణ, జీవాల సంరక్షణ కుటుంబాలుండగా.. 2,70,494 పశువులు ఉన్నాయి. అందులో మొదటి విడతగా 12,064కు ఆరోగ్య సంరక్షణ కార్డులు మంజూరయ్యాయి.

ప్రయోజనాలు మెండు

మనుషులకు ఆరోగ్యశ్రీ కార్డు ఎలా ఉపయోగపడుతుందో మూగ జీవాలకు కూడా ఆరోగ్య సంరక్షణ కార్డు అంతగా ప్రయోజనకరంగా ఉంటాయని పశువుల వైద్యులు పేర్కొంటున్నారు. పశువులకు సీజనల్‌గా వ్యాపించే వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలు వేయడంతో పాటు ఎప్పుడెప్పుడు ఏ టీకా వేయించాలనే వివరాలు కార్డులో తేదీల వారీగా నమోదు చేస్తారు. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభంలో 10శాతం జింక్ సల్ఫేట్ ద్రావణం తాగించటం ద్వారా జీవాల్లో కుంటువ్యాధి నివారిస్తారు. అలాగే పశువులు, ఆవులకు కృత్రిమ గర్భాధారణ చేసిన తేదీ, చూడి నిర్ధారణ తేదీ, దూడపుట్టిన తేదీలను కార్డులో నమోదు చేస్తారు. తద్వారా పశువులు, జీవాల ఆరోగ్య స్థితిగతులు, క్రయ విక్రయ వివరాలు వాటి సంరక్షకులకు స్పష్టంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

వైఎస్సార్ బీమా వర్తింపు

దేశీయ, సంకరజాతి ఆవులు, పశువులు ఓ సారి ఈనిన వాటికి 2 నుంచి 10 ఏళ్లలోపు ఆవులు, 3 నుంచి 12 ఏళ్లలోపు పశువులకు ఆరోగ్య సంరక్షమ కార్డుల ద్వారా వైఎస్సార్ బీమా వర్తిస్తుంది. ప్రమాదవశాత్తు మరణించినా, రోడ్డు ప్రమాదంలో మరణించినా పశువులు, ఆవులకు ఒక్కోదానికి రూ.30వేల బీమా ఇస్తారు. నాటు పశువులకు ఒక్కోదానికి రూ.15వేలు, ఒకటిన్నర ఏళ్లు పైబడిన మేలు జాతి ఎద్దులు, దున్నలకు ఒక్కోదానికి రూ.30వేలు, రెండేళ్లు పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు ఒక్కోదానికి రూ.15వేల చొప్పున ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిస్తారు. మేకలు, గొర్రెలకు ఒక్కోదానికి రూ.6వేల చొప్పున బీమా వర్తిస్తుంది. బీమా వర్తింపుకోసం ప్రభుత్వ రాయితీ పోను నిర్ణీత మొత్తం లబ్ధిదారుని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది.

శాస్త్రీయ పద్ధతుల్లో పశువులు, జీవాల సంరక్షణ

వాస్తవానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య సంరక్షణ కార్డుల వల్ల శాస్త్రీయ పద్ధతుల్లో పశువులను సంరక్షించుకునే అవకాశం ఉంటుంది. ఈ పద్ధతిని జీవాల సంరక్షణ ఫారాల్లో మాత్రమే అవలంబిస్తారు. అలాంటి శాస్త్రీయ పద్ధతులపై సాధారణ పశుపోషకులకు, సంరక్షకులకు పశువైద్యాధికారులు అవగాహన కల్పించి వాటి సంతతిని కాపాడుకునేలా చర్యలు తీసుకుంటారు. ఓ రైతుకు ఎన్ని పశువులు ఉంటే వాటన్నింటికి సంబంధించిన వివరాలు నమోదు చేసేలా ఆరోగ్య సంరక్షణ కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు.

ఆరోగ్య సంరక్షణ కార్డులివ్వడం సంతోషం



మనుషుల మాదిరిగా పశువులకు ఆరోగ్య సంరక్షణ కార్డులివ్వడం సంతోషం. కార్డుల వల్ల పశువులకు వేసిన టీకాలు, వ్యాపించిన వ్యాధులు, చేసిన చికిత్సల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది. కార్డుల వల్ల మేము పశువులకు ఎప్పటికప్పుడు టీకాలు వేయించుకోవడం, చికిత్సలు చేయించుకోవటానికి అవకాశం ఉంటుంది.

– కుమ్మరి రంగన్న, పశుపోషకుడు, తాటిపాడు

పశుపోషకులకు చాలా ప్రయోజనకరం



పశువులకు, జీవాలకు ఆరోగ్య సంరక్షణ కార్డులు మంజూరు చేయటం ప్రయోజనకరం. ఈ కార్డులు ఎక్కువగా పశువులు, జీవాలను సంరక్షించే పెద్ద పెద్ద ఫాంలలోనే వినియోగిస్తారు. అలాంటిది సాధారణ పశుపోషకులు, సంరక్షకులకు ప్రభుత్వం ఈ కార్డులు ఇవ్వడం వల్ల వాటి ఆరోగ్య స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకొని సకాలంలో చికిత్సలు చేయించుకొనే అవకాశం ఉంటుంది. అలాగే వైఎస్సార్ బీమా వర్తిస్తుంది.

– డాక్టర్.రామాంజనేయనాయక్, ఏడీ, పశుసంవర్ధకశాఖ

నీటిని దొంగలిస్తున్నా పట్టించుకోరా?


మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘం నాయకులు

కొత్తపల్లి: చెరువుల నుంచి నీటిని దొంగలించుకు పోతున్నా పట్టించుకోని ఇరిగేష్ అధికారులు అమ్ముడు పోయారా?, లేదా వారి అసమర్థతనా అని ఏపీ రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్ స్వాములు, ఎస్. సంజీవరాయుడు, పి.మహబూబ్ బాషా ప్రశ్నించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని సింగరాజుపల్లె గ్రామానికి చెందిన గంగిరేగువాగు చెరువు డెడ్ స్టోరేజ్‌లో ఉన్నా కొందరు అక్రమంగా ఆయిల్ ఇంజిన్లతో నీరు తరలిస్తున్నా మైనర్ ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యరించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. నీటి లభ్యత లేక పోవడంతో రబీలో పంటలు సాగుచేసుకోవద్దు అని కలెక్టర్ ఆదేశాలు, వ్యవసాయ శాఖ వారు చెప్పినా అధికారులు మాత్రం చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు. నీటి దొందలపై వెంటనే చర్యలు తీసుకొని, జలచౌర్యాన్ని అరికట్టాలని కోరారు.

దివ్యాంగ మహిళలకు ప్రభుత్వ అండ


విభిన్న ప్రతిభావంతులకు చెక్కులను అందజేస్తున్న మెప్మా అధికారులు

నందికొట్కూరు: దివ్యాంగ మహిళలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం దిశ దివ్యాంగ సురక్ష పథకం అమలుకు శ్రీకారం చుట్టిందని మెప్మా సీఎంఎం శాంతకుమారి అన్నారు. ఆదివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. బతుకు బండిని భారంగా లాగుతూ, మనో వేదనలో మునిగిన విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు. టైలరింగ్, కంప్యూటర్లలో శిక్షణ పొంది ఉపాధి పొందాలని కోరారు. బిస్మిల్లా విభిన్న ప్రతిభావంతుల సంఘానికి రూ.3 లక్షలు, స్వయం కృషి విభిన్న ప్రతిభావంతుల సంఘానికి రూ. 4 లక్షలు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా సీఓలు అర్చన, వినయ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేయించుకోండి


ఆత్మకూరులో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమాదేవి

ఆత్మకూరు: 18ఏళ్లు నిండిన యువతీ, యువకులందరూ తప్పనిసరిగా ఓటుహక్కు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ ఉమాదేవి సూచించారు. పట్టణంలో, మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ, మండ్లెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తనిఖీ చేశారు. బీఎస్‌ఓలు సేకరిస్తున్న ఫారం -6, 7, 8 లను పరిశీలించి పలు సూచనలిచ్చారు.

పాములపాడు: స్పెషల్ సమ్మరి రివిజన్ 2024కు సంబంధించి నిర్వహించిన ఓటు నమోదుకు మండలంలో 128 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు.

పగిడ్యాల: రెండవ రోజైన ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి 198 అర్జీలు నమోదైనట్లు తహసీల్దార్ భారతి తెలిపారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో పోటీ పడాలి


మాట్లాడుతున్న హెచ్‌ఎం ఈశ్వరమ్మ బాయి

శ్రీశైలంప్రాజెక్ట్: దివ్యాంగులు అన్ని రంగాల్లో పోటీ పడాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ ఈశ్వరమ్మ బాయి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆదివారం భవిత కేంద్రంలో ఉపాధ్యాయులు ఉమాశంకర్, జ్యోతి ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణశ్రీ, నందీశ్వర్, శ్రీను, ఇమ్రాన్, ఆరీఫ్, ఎమ్‌ఐఎస్ కోఆర్డినేటర్ మహబూబ్‌బాషా, పీఆర్‌సీ సంజీవరాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

వెలుగోడు: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెలుగోడు మండల కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అధ్యక్షతన స్థానిక బృందావనం స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లాలం రమేష్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, సెక్రటరీ జె ఇంతియాజ్, టి. రహంతుల్లా, నూరుల్లా, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద గ్లోబల్ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు కుమ్మరి రంగస్వామి, గౌరవ సలహాదారు ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

12న దివ్యాంగుల సభ

నందికొట్కూరు: ఈ నెల 12న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించే సభను విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు తలారి నాగన్న పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే వరకు వదలకుండా ముందుకు సాగుతున్నామని చెప్పారు. సమావేశంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, కోశాధికారి శేషమ్మ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో సండే సందడి


క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

మహానంది: కార్తీక మాసం, ఆదివారం సెలవు సందర్భంగా మహానంది భక్తులతో సందడిగా కనిపించింది. రెండు తెలుసు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం, నంది స్థూపం, నాగులకట్ట ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులు శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేపట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆలయ ప్రాంగణంలో అదనపు ప్రసాదం కౌంటర్‌ను ఏర్పాటు చేయించారు. వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.7 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

పంచలింగాల వృషభాల విజయకేతనం


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో నిర్వహించిన ఆరుపండ్ల ఎద్దుల అంతర్ రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో పంచలింగాల వృషభాలు విజయకేతనం ఎగురవేశాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామివారి ఆలయ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలను టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాలకుచెందిన 18 జతల ఎద్దులు పోటీలో తపడ్డాయి. పంచలింగాలకు చెందిన బైరిపో గుబుల్స్ మొదటిస్థానంలో నిలిచి రూ.30వేలు కైవసం చేసుకున్నాయి. సోమయాజులపల్లెకు చెందిన యాగాల నర్సయ్యయాదవ్ ఎద్దులు ద్వితీయస్థానంలో రూ.20వేలు, అనంతపురం జిల్లా, అక్కంపల్లికి చెందిన కోనేపల్లి ఇంద్రారెడ్డి ఎద్దులు తృతీయస్థానంలో రూ.15వేలు చేజిక్కించుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం, నారాయణపేట జిల్లా, జక్కిలేరు గ్రామానికి చెందిన జక్కిలేరు బాషా ఎద్దులు నాల్గొవస్థానంలో రూ.10వేలు, కర్నూలు జిల్లా, వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంక్, సాయిరాఘవ వృషభాలు ఐదొ వస్థానంలో రూ.6వేలు దక్కించుకున్నాయి. గుంటూరుకు చెందిన రాయపాటి విశ్వేశ్వరరావు ఎద్దులు ఆరోవ స్థానంలో నిలిచి రూ.4వేలు గెలుపొందాయి. విజేతలైన వృషభాల యజమానులకు టీటీడీ ఈఓ ధర్మారెడ్డి చేతులమీదుగా నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆళ్ల నాగేశ్వరరావు, తర్తూరు సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి, పోచా హేమశేఖర్‌రెడ్డి, నర్రెద్దుల శ్రీనివాసరెడ్డి, పోచా లోకేశ్వరరెడ్డి, ఈదుల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం చేరుకున్న మంత్రి అప్పలరాజు


మంత్రికి ఆహ్వానం పలుకున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల దర్శనార్థమై ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి డా.అప్పలరాజు శ్రీశైలం విచ్చేశారు. వీరికి భ్రమరాంబా అతిథిగృహం వద్ద దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సోమవారం ఉదయం మంత్రి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని అధికార వర్గాలు తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..


మహానందీశ్వర దర్శనానికి వచ్చిన ఐజీ అశ్విన్ కుమార్, సభ్యులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో కర్ణాటక ఐజీ అశ్విన్ కుమార్ శర్మ, కుటుంబ సభ్యులు ఆదివారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చిన వారికి ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ముడియం చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక యాగశాలలో ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు


కేక్‌కట్ చేస్తున్న మాజీ సర్పంచు రామసుబ్బయ్య

పాములపాడు: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై ఆదివారం మండల కేంద్రంలో రుద్రవరం గ్రామ మాజీ సర్పంచు జాలా రామసుబ్బయ్య ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కేజీ రోడ్డు వెంట ర్యాలీ నిర్వహించి మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం బస్టాండ్ సెంటరులో కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు ఇబ్రహీం, నూర్‌బాషా, మాబాష, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులను ఆదుకోవాలి


మంత్రి , ఎంపీలకు వినతి పత్రం అందజేస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

నందికొట్కూరు: గంగపుత్రులు ఆర్థికంగా, విద్యాపరంగా రాణించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గంగపుత్ర సంఘం నాయకులు న్యాయవాది మద్దయ్య కోరారు. ఆదివారం కర్నూలులో గంగపుత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమానికి హాజరై విజయవాడ వెళ్తున్న ఏపీ మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావును నందికొట్కూరు పట్టణంలో నియోజకవర్గ గంగపుత్రుల సంఘం సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుమునుపు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్దయ్య మాట్లాడుతూ గంగపుత్ర పిల్లలకు ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో గంగపుత్రులపై జరిగే దాడులను అరికట్టాలని కోరారు. అలవి వలలను నిషేధించి గంగపుత్రులను ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ శ్రీనివాసులు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి


విద్యార్థులను సన్మానిస్తున్న దశ్యం

మహానంది: ఐకమత్యంతో ఉంటేనే అన్ని రంగాల్లో రాణించగలుగుతామని కుమ్మరి శాలివాహన సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మద్దయ్య తెలిపారు. మహానందిలోని శ్రీ మహానందీశ్వర కుమ్మరి శాలివాహన అన్నదాన సత్రం ఆవరణలో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన సంఘం సభ్యులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీశైలం అన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు అనంత రమణ, నాగేశ్వరరావు, మహానంది అన్నదాన సత్రం అధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి గురునాథ్, ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యక్షులు తమ్మడపల్లె శివయ్య, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సంఘటితం కావాలి

నంద్యాల(వ్యవసాయం): ఆర్యవైశ్యులు ఐక్యతతో సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ శివారులోని మూల మఠంలో శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల కార్తీక వన భోజనాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మహిళలు ఉసిరిక చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాజకీయంగా ఆర్యవైశ్యులు అడుగులు వేయాలని కోరారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. కౌన్సిలర్ కండే శ్యాంసుందర్‌లాల్, బింగుమల్ల శ్యాంసుందర్ గుప్త, సుబ్బలక్ష్మయ్య, చంద్రశేఖర్, కంభం శీను, అడ్డగాళ్ల మల్లికార్జున, ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ దివ్య, ఇందుమతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నంద్యాల జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు భాస్కరరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల జీవో విడుదల చేయాలని, కేజీబీవీ టీచర్లకు టైమ్ స్కేల్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నంద్యాల(అర్బన్): ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక లక్ష్యమని, ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ గ్రామ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్నామని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక వ్యవస్థాపక బాధ్యులు డాక్టర్ బ్రహ్మారెడ్డి తెలిపారు. స్థానిక ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మీ ఆరోగ్యం–మీ చేతుల్లోనే అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగులు వైద్యులను సంప్రదించకుండా తమ రోగాలను తామే నయం చేసుకునేలా వారిలో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో పూర్తి స్థాయి ఆరోగ్య సూత్రాలకు సంబంధించి సమగ్రమైన శిక్షణా తరగతులను మూడు రోజుల పాటు నిర్వహింస్తామని చెప్పారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకుమల్ల రహీం, కోశాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం


పువ్వాడి భాస్కర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, ఆర్యవైశ్యులు

వెలుగోడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆర్యవైశ్యులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పువ్వాడి భాస్కర్‌ను ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ హానరరీ వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పువ్వాడి భాస్కర్‌ను వెలుగోడు, బండిఆత్మకూరు మండలాలకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. తనకు మండల పరిషత్ అధ్యక్ష పదవి ఇచ్చి ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అలాగే ఆత్మకూరు మునిసిపల్ వైస్ చైర్మన్‌గా దివ్యకు అవకాశం కల్పించారని, తాజాగా పువ్వాడి భాస్కర్‌ను వైల్డ్ లైఫ్ వార్డన్‌గా నియమించి సముచిత స్థానం కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు లాలం రామకృష్ణయ్య, శివ మల్లికార్జున, జూటూరు నాగ పుల్లయ్య, లక్ష్మీనారాయణ, లాలం సత్యనారాయణ, బండి ఆత్మకూరు ఆర్యవైశ్యులు మధుసూదన్ గుప్తా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.